# ధరణి తీసేస్తే దళారీ రాజ్యమే..

- తెలంగాణను సర్వనాశనం చేసింది కాంగ్రెస్సే..
- కృష్ణా, తుంగభద్ర నదులు పారుతున్నా ప్రాజెక్టులు కట్టమని ఒక్కరూ అడగలేదు
- అంబలి, గంజి కేంద్రాలు పెట్టే దౌర్భాగ్యస్థితికి తీసుకొచ్చారు..
- మన బాగోగులు చూసే పార్టీకే పట్టం కట్టాలి
- ఎమ్మెల్యేలు ఆల, చిట్టెంను భారీ మెజార్టీతో గెలిపించాలి
- దేవరకద్ర, మక్తల్ ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్


దేవరకద్రలో హెలికాప్టర్ దిగి ఆశీర్వాద సభా వేదిక వద్దకు వెళ్తున్న సీఎం కేసీఆర్

మహబూబ్‌నగర్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ''కృష్ణా తుంగభద్రా నదులు పారుతున్నా ఏ ఒక్కరూ ప్రాజెక్టు కట్టమని అడగలే. ఉమ్మడి రాష్ట్రంలో గంజి, అంబలి కేంద్రా లు పెట్టే దౌర్భాగ్య స్థితికి తీసుకొచ్చి పాలమూరు జిల్లాను సర్వనాశనం చేసింది కాంగ్రెస్ పార్టీ'' అని బీఆర్ఎస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.. సోమవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం కేసీఆర్ సుడిగాలి పర్యటన చేపట్టారు. దేవరకద్ర, గద్వాల, మక్తల్, నారాయణపేట ప్రచార సభల్లో సీఎం పాల్గొన్నారు. హెలికాప్టర్ సాంకేతిక లోపం వల్ల దాదాపు 5 గంటలు ఆలస్యంగా వచ్చి నా జనం ఓపికతో కేసీఆర్ కోసం ఎదురు చూడటం గమనార్హం.. ఈ సందర్భంగా దేవరకద్ర, మక్తల్ సభలో సీఎం మాట్లాడుతూ.. ఎన్నికలు వస్తుంటయి.. పోతుంటయి.. మనం ఆలోచించుకొని ఓటు వేయాలని ఓటర్లకు సూచించారు. ఓటు ఒక వజ్రాయుధం, దాన్ని ఎవరికంటే వారి కి వేసి మన భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కోరారు. ఎన్నికలు వస్తే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు పోటీ చేస్తాయి. కానీ అందులో ఏ పార్టీ మన బాగోగులను పట్టించుకుంటదనే దానిపై చర్చ జరగాలన్నారు. గతంలో ఎంతోమంది ముఖ్యమంత్రులు పాలమూరు జిల్లా నుంచి వలసలు పోతున్నా పట్టించుకోలేదు.. గుక్కెడు నీళ్ల కోసం ఎంతో తపించారు.. సమైక్య రాష్ట్రంలో ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా పాలమూరు లో ప్రాజెక్టులు కట్టాలని అడగలేని దౌర్భాగ్య స్థితి ఉండేదన్నారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ కలవడం వల్ల తీవ్ర అన్యాయానికి గురైందని, నీటి వాటా అడిగే స్థితిలో కూడా తెలంగాణ ప్రాంతం లేదని స్వయంగా బచావత్ ట్రి బ్యునల్ ఆవేదన చెందిందని.. ఇది వాస్తవమని చరిత్ర చెబుతుందన్నారు. బచావత్ ట్రిబ్యునల్ జూరాలకు 15 టీఎంసీలు కేటాయించిందిన్నా రు. అంజయ్య ముఖ్యమంత్రి అయ్యాక జూరాల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి నిర్మించారన్నారు. 2001 వరకు కూడా కర్ణాటక రాష్ట్రంలో ముంపు గ్రామాలకు నష్టపరిహారం ఇవ్వకపోవడంతో జూరాల ప్రాజెక్టును అంతంత మాత్రమే కట్టి వదిలేశారని చెప్పారు. తెలంగాణ వచ్చినంక కో యిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశామన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించామని, వాగులపై చెక్ డ్యాంలు నిర్మించిన ఘనత ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిగారు.. ఇప్పటినుంచి ఎమ్మెల్యే ఆల పేరు చెక్ డ్యాంల వెంకటేశ్వర్‌రెడ్డి అని సీఎం కేసీఆర్ అభివర్ణించారు. ఈసారి ఆలను భారీ మెజార్టీతో ఆశీర్వదించాలని కోరారు. మక్తల్‌లో భీమా, సంగంబండ, భూత్పూర్ రిజర్వాయర్లను ఏర్పాటు చేసి దాదాపు రెండులక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న నియోజకవర్గంగా రాష్ట్రంలో మొట్టమొదటిదన్నారు. ప్రజలు కష్టసుఖాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని కూడా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తండ్రి చిట్టెం నర్సిరెడ్డి బాటలో పయనిస్తున్న రామ్మోహన్‌రెడ్డి పేదల కష్టసుఖాల్లో పాలుపంచుకునే వ్యక్తి అని కొనియాడారు. హైదరాబాద్‌లో ఒక్క నిమిషం కూడా ఎమ్మెల్యే చిట్టెం ఉండడని, ఏ అర్ధరాత్రి అయినా మక్తల్‌కు చేరుకుంటాడని తెలిపారు. ఈ ఎన్నికల్లో గెలిపిస్తే ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ స్వర్ణమ్మ, సాట్స్ చైర్మన్ ఆంజనేయ గౌడ్, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, చంద్రశేఖర్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మహిళా నాయకురాళ్లు చిట్టెం సుచరిత, ఆల మంజుల, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, కదిరి శేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, ప్రదీప్‌కుమార్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.


మక్తల్ సభలో నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు


దేవరకద్రలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఆల ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ప్రజలు

# నడిగడ్డను నాశనం చేసింది కాంగ్రెస్సే..

- అభివృద్ధికి పాటుపడే వ్యక్తిని ఆదరించండి
- గద్వాలను గబ్బు పట్టించిన గలీజ్‌గాళ్లెవరో మీకు తెలుసు
- దళారీ వ్యవస్థ లేనిది.. ధరణి
- వాల్మీకి బోయలను ముంచింది ఆ పార్టీ నాటి సీఎం నీలం సంజీవరెడ్డి
- కేంద్రం మెడలు వంచైనా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి ప్రయత్నిస్తాం: గద్వాల ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్

గద్వాల/అలంపూర్, నవంబర్ 6: ''ధరణిని బంగాళాఖాతంలో కలపాలని కాంగ్రెసోళ్లు అంటునరు.. దళారీ వ్యవస్థ లేకుండా ధరణిని రూపొందించాం.. దాని ద్వారానే రైతులకు రైతుబంధు, బీమా ఇస్తున్నాం.. ధరణి లేకపోతే ఇది సాధ్యం కాదు.. ఇగ్గం, ఎవుసం తెలియని రాహుల్‌గాంధీ ధరణి వద్దంటున్నారు. వారికి మళ్లీ దళారీ వ్యవస్థ తీసుకరావాలనే ఆలోచన ఉంది. అటువంటి వాళ్లను బంగాళాఖాతంలోకి విసిరి వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది'' అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. సోమవారం అయిజ రహదారిలో తెలంగాణ చౌరస్తా సమీపంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అధ్యక్షతన ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించగా ముఖ్యమంత్రి పాల్గొని కాంగ్రెస్‌పై ఘాటు విమర్శలు చేశారు. గద్వాలకు ఎంతో చరిత్ర ఉందని, జోగుళాంబ అమ్మవారి పేర జిల్లాను ఏర్పాటు చేసుకొని ఆమె ఆశీర్వాదంతో అభివృద్ధిలో ముందుకు సాగుతున్నామన్నారు. ఎన్నికలు వస్తుంటయి.. పోతుంటయి.. కానీ ప్రజల గురించి ఆలోచించే నాయకుడు, పార్టీని ప్రజలు ఆదరించాలన్నారు. అధికారంలోకి వచ్చే పార్టీలు పేదల కోసం ఏం చేస్తాయో ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల చరిత్ర అందరికీ తెలుసని, వాటి గురించి పెద్దగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. కృష్ణా–తుంగభద్రా నదుల మధ్య ఉన్న నడిగడ్డను నాశనం చేసింది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. కృష్ణా నీళ్లు మాకొద్దని ఆంధ్రాప్రాంతం నాయకుడి వెంట ఇక్కడి కాంగ్రెస్ నాయకురాలు వెళ్లి హారతులు పట్టిందని.. ఇది కాంగ్రెస్ చరిత్ర అని దుయ్యబట్టారు. హస్తం పార్టీ మొదటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి వాల్మీకి బోయలను ముంచాడని, ఆయన ఆనాడు వారిని ఎస్టీ జాబితాలో చేర్చే అవకాశం ఉన్నా పట్టించుకోలేదన్నారు. తమ ప్రభుత్వం వారిని ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపినా కేంద్రం పట్టించుకోలేదని.. ఈసారి గెలిపిస్తే కేంద్రం మెడలు వంచైనా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి ప్రయత్నిస్తామన్నారు. ఆర్డీఎస్‌ను ఆగం పట్టించింది ఎవరో ఈ ప్రాంత ప్రజలకు బాగా తెలుసు.. కరువుతో నడిగడ్డ గోసపడ్డది.. పిడికెడు మందితో ఇక్కడి నుండి ఉద్యమం చేసి రైతుల స్థితిగతులు తెలుసుకున్నామన్నారు. 2004లో తెలంగాణ ఇస్తానని కాంగ్రెస్ మోసం చేసిందని.. ఆ సమయంలో టీఆర్ఎస్‌ను చీల్చే ప్రయత్నం కూడా చేసిందన్నారు. కేసీఆర్ సచ్చుడో–తెలంగాణ వచ్చుడో అని బలమైన ఉద్యమం చేస్తే విధి లేని పరిస్థితిలో తెలంగాణను ఇచ్చిందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా నెట్టెంపాడ్ ద్వారా 20వేల ఎకరాలకు సాగునీరు అందగా స్వరాష్ట్రంలో ప్రస్తుతం 1.60లక్షల ఎకరాలకు అందుతున్నదన్నారు. గట్టు ఎత్తిపోతల పనులు చకచకా జరుగుతుండగా జిల్లా కేంద్రంలో సెంట్రల్‌లైటింగ్ ఏర్పాటుతో పాటు ఇంటిగ్రేటెడ్ మార్కెట్, నూతన బస్‌స్టాండ్, జూరాల వద్ద బృందావనం పార్కు పనులు జరుగుతున్నాయన్నారు. గద్వాలకు నర్సింగ్ కళాశాలతోపాటు మెడికల్ కళాశాల మంజూరు చేశామని, వైద్యపరంగా అభివృద్ధి చేయాలనే ఆలోచనతో 300 పడకల దవాఖాన పనులు పూర్తి చేశామన్నారు. పేదల సంక్షేమం కోసం పాటు పడుతున్న పార్టీకి ఓటు వేస్తారో.. ఉచిత హామీలు ఇచ్చి మోసం చేసే వారికి ఓటు వేస్తారో ఓటర్లు ఆలోచించుకోవాలన్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ మార్చి నుంచి సన్న బియ్యం సరఫరా చేస్తామన్నారు. ఓటర్లు ఆగమాగమై ఓటు వేయకుండా ఆలోచించి ఓటు వేయాలన్నారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి రైతుబంధు వద్దంటున్నడు.. రేవంత్ మూడుగంటల కరెంట్ చాలు అంటున్నడు.. ఇలా రైతు సంక్షేమ పథకాలు నిలిపి వేయాలనుకునే వారికి మీరు ఓటేస్తే వారు రైతుబంధుకు రాంరాం పలుకుతారన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అన్నీ కష్టాలేనన్నారు. గత కాంగ్రెస్ పాలనలో అస్తవ్యస్త కరెంట్ ఉండడం వల్ల రైతులు రాత్రిపూట పొలాలకు మోటర్ల ద్వారా నీరు పెట్టడానికి వెళ్లి పాముకాటు, విద్యుత్‌షాక్‌కు గురైన ఘటనలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం రైతులు తమకు ఇష్టం వచ్చినప్పుడు నీరు పారించుకోవడానికి ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తుందని చెప్పారు. ధరణి రద్దు చేస్తే ప్రజలు ఆగమవుతారని, ధరణి ఉంది కాబట్టే రైతుల ఖాతాల్లో ఎటువంటి కమీషన్ లేకుండా రైతుబంధు పడుతుందన్నారు. ధరణి వద్దంటే దళారీ వ్యవస్థ రాజ్యమేలుతుందని వివరించారు. గద్వాల అభివృద్ధికి నిరంతరం పాటుపడే కృష్ణమోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ప్రజలపైనే ఉందని చెప్పారు. సమావేశంలో ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ రాములు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఢిల్లీలో ప్రభుత్వ అధికార ప్రతినిధి మందా జగన్నాథం, మున్సిపల్ చైర్మన్ కేశవ్, గద్వాల అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి రాకేశ్, రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రామన్‌గౌడ్, మార్కెట్‌కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, జెడ్పీ వైస్‌చైర్మన్ సరోజమ్మ, పీఏసీసీఎస్ చైర్మన్ సుభాన్, మాజీ జెడ్పీ చైర్మన్ భాస్కర్, నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.


మల్దకల్ : సభకు బైక్‌లతో ర్యాలీగా వెళ్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

# రోడ్ షో అదుర్స్..

- వేలాదిమందితో సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు
- అభివాదం చేస్తూ ముందుకుసాగిన ముఖ్యమంతి


బస్సులోంచి కార్యకర్తలకు అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్

మహబూబ్‌నగర్, నవంబర్ 6 : నారాయణపేటలో ప్రజా ఆశీర్వాద సభ ముగించుకొని మహబూబ్‌నగర్‌కు విచ్చేసిన సీఎం కేసీఆర్‌కు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు గులాబీపూలతో ఘన స్వాగతం పలికారు. రోడ్ షో ఉందని తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో వన్‌టౌన్ చౌరస్తాకు చేరుకొని సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెళ్తున్న బస్సుపై గులాబీపూలు వేస్తూ స్వాగతం పలికారు. కాగా సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ నాయకులకు అభివాదం చేస్తుండగా బస్సు ముందుకుసాగింది. జై కేసీఆర్.. జైజై కేసీఆర్ అంటూ ప్రజలు నినదించారు. వన్‌టౌన్ చౌరస్తాతో పాటు శివశక్తినగర్ కమాన్, భగీరథ కాలనీ, క్రిస్టియన్‌పల్లి, బైపాస్ రోడ్డు, పాలకొండ చౌరస్తా, పిస్తా హౌస్‌తోపాటు పలు ప్రధాన కూడళ్లకు బీఆర్ఎస్ నాయకులు భారీస్థాయిలో చేరుకొని ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో హన్వాడ ఎంపీపీ బాలరాజు, బీఆర్ఎస్ నేతలున్నారు.